సాక్షి
సంగారెడ్డి

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



పాడుబడిలో పిల్లల పాట్లు..

జిల్లాలోని మహాత్మా పూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు 8లో ▸



కొండ చిలువలతో భయం

చందాపూర్ గ్రామస్తులను కొండ చిలువలు హడలెత్తిస్తున్నాయి. దీంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. వివరాలు 8లో ▸



అన్నదాతకు మళ్లీ నిరాశే!

న్యాల్‌కల్ మండలంలోని రాంతీర్థం గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్థానిక బ్యాంకులో రూ.2.50 లక్షల పంట రుణం తీసుకున్నాడు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

8న నల్లవాగు నీటి విడుదల

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు కింద యాసంగీ పంటల సాగు కోసం ఈ నెల 8న నీటిని విడుదల చేయనున్నట్లు నీటి పారుదల శాఖ డీఈఈ పవన్‌కుమార్ గురువారం తెలిపారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి కాల్వల ద్వారా నీటి విడుదల చేస్తారని తెలిపారు. ప్రాజెక్టు కింద 4,089 ఎకరాలకు సాగు నీరు విడుదల చేయాలని ఇటీవల జరిగిన జిల్లా నీటి పారుదల అభివృద్ధి బోర్డు(డీఐబీ) సమావేశంలో నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. కుడి కాల్వ పరిధిలో 2,989 ఎకరాలు, ఎడమ కాల్వ పరిధిలో 1,100 ఎకరాల ఆయకట్టుకు నీరు అందజేస్తామని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో

రాయికోడ్(అందోల్): ఎప్పటికప్పుడు విద్యార్థుల సందేహాలను తీరుస్తూ వారు ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. రాయికోడ్‌లోని జెడ్పీహెచ్ఎస్,కేజీబీవీ, మోడల్ స్కూల్‌లను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాదిలో పదో తరగతి ఫలితాల కంటే ఈసారి మరింత మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేసి సమష్టిగా కృషి చేసి విద్యార్థుల అభ్యాసనాభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో వి.అంజయ్య, ప్రిన్సిపాల్ పాపారావు, ఎస్‌వో దీపిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టిని పరీక్షించాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

సంగారెడ్డి టౌన్ : ప్రతీ ఒక్క రైతు మట్టిని పరీక్షించి తగిన పద్ధతిలో సంరక్షించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రసాయనిక ఎరువులు పురుగుల మందులు వాడకంతో నేల జీవ రాశులు నష్టపోతున్నాయని జీవ కార్మిక వ్యవసాయ పద్ధతులు అందుబాటులో రావాలని వివరించారు. భవిష్యత్తు తరాలకు సారవంతమైన భూమిని అందించడానికి మనమంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఝాన్సీ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హామీలను వెంటనే అమలు చేయాలి

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

సంగారెడ్డి ఎడ్యుకేషన్: దివ్యాంగులకు పింఛను రూ.6 వేలకు పెంచడంతోపాటు ఎన్నికల్లో వారికిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో గురువారం నిర్వహించిన వికలాంగుల సంఘం నాయకుల సమావేశం అడివయ్య పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. పెన్షన్ పెంపు నిర్ణయం కోసం 44.44 లక్షల మంది ఆసరా లబ్ధిదారులు ఎదురుచూస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. పెన్షన్ పెంపు కోసం డిసెంబర్ 10న జరిగే ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మాణిక్యం, జిల్లా కార్యదర్శి నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షులు జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికావస్తోన్న సందర్భంగా జిల్లాలోని ఆయా నియోజకవర్గాల అభివృద్ధి, నెలకొన్న సమస్యలు, ఎమ్మెల్యే పనితీరుపై 'సాక్షి'ఆరా తీసింది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఎమ్మెల్యే పదవి లేకపోయినా నియోజకవర్గం అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేసి ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు సంగారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యేసరికి బీఆర్ఎస్ పార్టీ అధికారంలో లేకుండా పోయింది. ప్రభుత్వంతో కొట్లాడైనా సరే నియోజకవర్గానికి నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో 'సాక్షి'తో చెబుతున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...



సంగారెడ్డి సమగ్రాభివృద్ధే లక్ష్యం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి :

- ఎమ్మెల్యేగా లేనప్పుడే అభివృద్ధి పనులు చేశా
- ఈసారి ఆశీర్వదించారు.. ఈ అభివృద్ధిని కొనసాగిస్తా
- అభివృద్ధి నిధుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం
- హామీల అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం
- 'సాక్షి'ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యే పదవిలో లేకపోయినప్పటికీ సంగారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తుల కృషి చేసిన. అందుకే ఈసారి ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడతా. ఎన్నికల హామీలు నెరవేర్చేవరకు అధికార పార్టీని ప్రశ్నిస్తూనే ఉంటా. సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేవరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తునే ఉంటా.

రహదారులపై...

సంగారెడ్డి నియోజకవర్గం పరిధిలో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన. ఈ ఏడాది రూ.46.5 కోట్ల నిధులు వచ్చాయి. తంగెడిపల్లి నుంచి మల్లారెడ్డిపేట్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15 కోట్లు, మల్లేపల్లి నుంచి కొండాపూర్ రోడ్డుకు మరో రూ.15 కోట్లు, సంగారెడ్డి పట్టణంలోని బైపాస్‌రోడ్డు విస్తరణ, అభివృద్ధికి రూ.12 కోట్లు, కలివేముల నుంచి పొత్తిరెడ్డిపల్లి చౌరస్తా వరకు రూ.4.5 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయించేందుకు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతున్నాను. ఈ పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నా.

సంగారెడ్డికి డంప్ యార్డుపై

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణానికి డంప్ యార్డు సమస్య ఎన్నో దశాబ్దాలుగా ఉంది. ఈ సమస్యను అధిగమించేందుకు శాయశక్తుల కృషి చేసిన. హనుమాన్‌నగర్‌లో ఈ యార్డు కోసం స్థలం కేటాయించినం. స్థానికులు కొందరు వ్యతిరేకించారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయించేందుకు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాను. సంగారెడ్డిలో రూ.11.30 కోట్లతో చేపట్టిన వెజ్,నాన్‌వెజ్ మార్కెట్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీన్ని పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశాను.

ప్రభుత్వ పనితీరుపై...

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోంది. ఆరు గ్యారెంటీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సాకులు చెబుతోంది. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోంది. ఎన్నికల హామీలు మహిళలకు ప్రతీనెల రూ2,500లు, కుటుంబసభ్యులిద్దరికీ పెన్షన్, రైతుబంధు, నిరుద్యోగభృతి, కౌలు రైతులకు ఆర్థికసాయం ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో హామీలు అమలు చేయడం లేదు. ఈ హామీలు అమలు చేసేవరకు ప్రభుత్వంపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తూనే ఉంటా.



మెడికల్ కాలేజీ మంజూరు చేయించా..

సంగారెడ్డిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనేది ఎన్నో ఏళ్ల కల. గత ఐదేళ్లలో ఈ మెడికల్ కాలేజీతోపాటు, నర్సింగ్ కాలేజీని కూడా మంజూరు చేయించిన. జిల్లా కేంద్ర ఆసుపత్రిని 450 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయింది. సదాశివపేట ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా మార్చాము. మిషన్‌భగీరథ పథకం కింద ఇంటింటికీ తాగు నీరు, మిషన్‌కాకతీయ పథకం కింద చెరువుల పునరుద్ధరణ ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన.

సంగమేశ్వర, బసవేశ్వరపై..

సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను ప్రభుత్వం త్వరితగతిన చేపట్టాలి. ఈ రెండు ఎత్తిపోతల పథకాలతో సుమారు రెండున్నర లక్షల ఎకరాల బీడు భూములు సాగులోకి వస్తాయి. సంగారెడ్డి రైతాంగ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పథకం పనులను ప్రభుత్వం వెంటనే చేపట్టాలి. ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాము.

ఎస్‌డీఎఫ్ నిధులపై..



బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నియోజకవర్గం అభివృద్ధి కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డీఎఫ్) వచ్చాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఎస్‌డీఎఫ్ పనులను కొన్నింటిని నిలిపివేసింది. పనులు ప్రారంభం కాలేదనే సాకుతో ప్రభుత్వం సంగారెడ్డి మున్సిపాలిటీకి రూ.ఆరు కోట్లు, సదాశివపేట బల్దియాకు రూ.ఏడు కోట్లు వెనక్కి తీసుకుంది. ఈ నిధులు మంజూరు చేయాలి. అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదు.



సంగారెడ్డికి మెట్రో రైలుపై

మెట్రో రైలును సంగారెడ్డి వరకు పొడిగించాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. ప్రస్తుతం పటాన్‌చెరు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం భావిస్తోంది. విడతల వారీగా సంగారెడ్డికి కూడా పొడిగిస్తే నియోజకవర్గం ప్రజలకు మేలు జరుగుతుంది. ఇక్కడి నుంచి నిత్యం వేలాది మంది ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లి వస్తుంటారు. వారి సౌకర్యం కోసం మెట్రోను సాధ్యమైనంత తొందరలో సంగారెడ్డి వరకు పొడిగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.



అందోల్‌లో నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర

ఏడాదిలోగా వైద్యసేవలు

- మంత్రి దామోదర రాజనర్సింహ
- 150 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన
- జోగిపేట, అందోల్‌లో ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు

జోగిపేట(అందోల్): అందోల్‌లో వంద పడకల ఆస్పత్రి, 50 పడకల మాతా శిశు సంరక్షణ కేంద్రం, నర్సింగ్ కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఈ ఆస్పత్రి ఏర్పాటుతో అందోల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. జిల్లా స్థాయి ఆస్పత్రిగా అభివృద్ధి చేసి ఏడాదిలోగా వైద్య సేవలు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కొత్త ఆస్పత్రిలో అన్ని రకాల ప్రత్యేక వైద్య సేవలు, అధునాతన సాంకేతిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. ఈ ఆస్పత్రి ఏర్పాటుతో యాంటీ నాటల్ చెకప్, డెలివరీల కోసం ఇకపై గర్భిణులు సంగారెడ్డి వరకూ వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. అందోల్ ఎంసీహెచ్‌లోనే మహిళలు, పిల్లలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. నర్సింగ్ విద్యను అభ్యసించాలని ఆశిస్తున్న విద్యార్థుల కలను నెరవేరుస్తూ అందోల్‌లో నర్సింగ్ కాలేజీని ప్రారంభించామని చెప్పారు.

60 సీట్లతో నర్సింగ్ కళాశాల

60 బీఎస్సీ నర్సింగ్ సీట్లతో కళాశాలను ప్రారంభించామని, ప్రస్తుతం డిగ్రీ కాలేజీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నామని మంత్రి దామోదర తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాలేజీకి నూతన భవనాన్ని, నర్సింగ్ విద్యార్థులకు హాస్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. కాలేజీ, ఆస్పత్రితో అందోల్ నియోజకవర్గ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతాయన్నారు. ఏడాది కాలంలోనే అందోల్ నియోజకవర్గానికి సుమారు రూ.600 కోట్ల నిధులు తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ వాణి, ఆర్డీవో పాండు, జోగిపేట్ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, కౌన్సిలర్‌లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని ముందు గుర్తించేది గురువులే

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను ముందుగా గుర్తించి ప్రోత్సహించేది గురువులేనని, పిల్లలెప్పుడు తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జోగిపేట, అందోల్‌లోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గురువారం జన్మదిన వేడుకలను వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ...సమాజాన్ని తీర్చిదిద్దేది మహిళలేనని అందుకే అమ్మాయిలకు చదువు చాలా ముఖ్యమన్నారు. అందోల్ అమ్మాయిలకు ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతోందని చెప్పారు. ఇప్పటికే అమ్మాయిలకు సంబంధించిన అన్నిరకాల విద్యా సంస్థలు ఇక్కడున్నాయని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే విద్యతో పాటు క్రమశిక్షణ, నిరంతర కృషి అవసరమని సూచించారు. అంతకుముందు మంత్రి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, మంత్రి సతీమణి పద్మిణీ, మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, ఏఎంసీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



హరీశ్‌రావుకు పోలీసు స్టేషన్‌లో సంఘీభావం తెలుపుతున్న చింతా ప్రభాకర్

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్: మాజీమంత్రి హరీశ్‌రావు అరెస్టును సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావుని గురువారం ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ కవిత, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ కలసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ...రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతోందని, ఈ ప్రభుత్వానికి ప్రజాకోర్టులో సంకెళ్లు తప్పవన్నారు. పోలీసు వ్యవస్థ కాంగ్రెస్ నేతలకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్‌లా వ్యవరిస్తుందని, ఇతరుల సమస్యల మాత్రం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో పోలీసులు తప్పులు చేస్తున్నారని, రాజకీయ పార్టీలను అణిచివేసే ధోరణితో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఏడాది దుర్మార్గపు పాలనపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం శాశ్వతం కాదని ఆయన పతనం మొదలైందని హెచ్చరించారు. వెయ్యి మంది రేవంత్‌రెడ్డిలు ఒకటైనా బీఆర్ఎస్ పార్టీని ఏమి చేయలేరని స్పష్టం చేశారు.

రేపటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

రిజిస్ట్రేషన్‌కు ప్రత్యేక వెబ్‌సైట్

సంగారెడ్డి జోన్: గ్రామీణప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సీఎం కప్ -2024 క్రీడాపోటీలను నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల7 వరకు రూపొందించిన www.cmcup2024telangana.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

నాలుగు దశల్లో క్రీడా పోటీలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన క్రీడలు నాలుగు దశల్లో చేపట్టనుంది. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలను నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ఈ నెల 7, 8న, మండల, మున్సిపాలిటీ స్థాయిలో 10 నుంచి 12 వరకు, జిల్లా స్థాయిలో 16 నుంచి 21 వరకు, రాష్ట్రస్థాయిలో 27 నుంచి జనవరి 2 వరకు నిర్వహించనున్నారు. ఈ విధంగా పోటీల నిర్వహణకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రణాళికలను రూపొందించి, షెడ్యూల్‌ను ఖరారు చేసింది.

వివిధ విభాగాలలో పోటీల నిర్వహణ

వివిధ స్థాయిలలో నిర్వహించే క్రీడా పోటీలను 10 విభాగాలలో నిర్వహించనున్నారు. గ్రామ, మండల స్థాయిలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, ఫుట్‌బాల్, యోగావిభాగాలు, జిల్లా స్థాయిలో మండల స్థాయితోపాటు బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్, హాకీ, బేస్‌బాల్, జూడో పుష్, సైక్లింగ్, పారా స్పోర్ట్స్ ఉంటాయి. వివిధ స్థాయిలలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు ప్రదానంతో పాటు సర్టిఫికెట్లను కూడా అందజేయనున్నారు.

సంబురాలు ఎందుకోసం

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సందర్భంగా నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు ఎందుకోసం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి సంగారెడ్డిలోని పాత బస్టాండ్ వరకు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి మాట్లాడుతూ...కాంగ్రెస్ ఏడాది పాలన అంతా శూన్యమన్నారు. ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా సంబురాలు చేసుకోవటం సిగ్గుచేటన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం

- మంత్రి దామోదర రాజనర్సింహ
- కలెక్టరేట్ ఆవరణలో క్యాంటీన్ ప్రారంభం

సంగారెడ్డి జోన్: జిల్లాలో ఇందిరా క్రాంతి, మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రజా పాలన విజయోత్సవాలు -2024, ఇందిరా క్రాంతి పథకం-మహిళా శక్తిలో భాగంగా గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్‌ను మంత్రి దామోదర, కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలసి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. జిల్లా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...కలెక్టరేట్ క్యాంటీన్ ప్రారంభించడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. మహిళా సంఘాలకు మొత్తం రూ.650 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.



మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న మంత్రి దామోదర, కలెక్టర్ క్రాంతి తదితరులు

'ఉపాధి'లో పశువుల పాకలు

- పాడి అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు
- పౌల్ట్రీఫాంల నిర్మాణానికి లబ్ధిదారుల ఎంపిక

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఉపాధి హామీ పథకంలో కీలక మార్పులు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద పాడి రైతులకు ఉచితంగా పశువుల పాకలు (క్యాటిల్ షెడ్లు) నిర్మించి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందిర మహిళా శక్తి - ఉపాధి భరోసా కింద ఉపాధి హామీ నిధుల నుంచి లబ్ధిదారులకు ఆర్థికసాయాన్ని అందించనున్నారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి కూలీల ఖర్చులు పోగా, సుమారు రూ.85,100 వరకు అంచనా వ్యయంగా నిర్ణయించారు. పశువుల పాకలు నిర్మించుకునే రైతులకు ఈ మొత్తాన్ని అందించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.

లక్ష్యంగా 240 యూనిట్లు

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించాలనే డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది.

ఆర్థిక ఏడాది ముగిసేలోపు

ఉపాధి హామీ పథకం కింద కేంద్రం నుంచి వచ్చే నిధులను ఎప్పటికప్పుడు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఆర్థిక ఏడాది ముగిసేలోపు నిధులను ఖర్చు చేయని పక్షంలో ఆ నిధులు వచ్చే రానున్న ఆర్థిక సంవత్సరానికి క్యారీ ఫార్వర్డ్ అవుతుంటాయి. మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లాలో సుమారు రూ.43 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు ఈ నిధులను వినియోగించుకోవాలని జిల్లా అధికార యంత్రాంగం భావిస్తోంది.

ఇందులోభాగంగా పాడి రైతులను ప్రోత్సహించేందుకు ఈ పశువుల పాకలను నిర్మించుకునేందుకు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఈ పథకం కింద జిల్లా వ్యాప్తంగా తొలివిడతలో 240 యూనిట్లను అందజేయాలని భావిస్తున్నారు. ఒక్కో మండలానికి పది యూనిట్ల లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ షెడ్లు నిర్మించుకునేందుకు ముందుకొచ్చిన వారికి



లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారు.

పాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు...

ప్రభుత్వం వివిధ పథకాల కింద లబ్ధిదారులకు గేదెలను పంపిణీ చేసింది. ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయక సంఘాల) మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఇందిర క్రాంతి పథం ఐకేపీ) కింద వీటిని ఇచ్చారు. ఇతర పథకాల కింద కూడా పాడి గేదెలను పంపిణీ చేశారు. వీటికోసం క్యాటిల్ షెడ్లను నిర్మిస్తే మరింత ప్రోత్సహించినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

పౌల్ట్రీఫాంలకూ రూ.2లక్షలు

కేవలం క్యాటిల్ షెడ్లే కాకుండా పౌల్ట్రీఫాం షెడ్లు నిర్మించుకునేందుకు ముందుకొచ్చిన రైతులకు కూడా ప్రభుత్వం ఈ ఉపాధి హామీ పథకం కింద రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఈ కేటగిరీలో జిల్లాలో 24 మండలాల్లో 24 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోరులో నల్గొండ, కరీంనగర్ జట్లు

వర్గల్(గజ్వేల్): జ్యోతిబా పూలే బీసీ గురుకులాల బాలికల రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు గురువారం వర్గల్ పూలే గురుకులం వేదికగా ప్రారంభమయ్యాయి. శనివారం వరకు జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాతోపాటు అన్ని జిల్లాలోని పూలే గురుకులాలకు చెందిన 1,400 మంది బాలికలు తమ ప్రతిభ చాటుకోనున్నారు. అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో పోటీలు మొదలయ్యాయి. తొలి రోజు లీగ్ దశలో ఒక్కో జట్టు ప్రతీ క్రీడాంశంలో రెండేసీ మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటుతూ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేయాలని గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి పేర్కొన్నారు.

విధులపై నిర్లక్ష్య ధోరణి వద్దు



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న హెల్త్ డైరెక్టర్

శివ్వంపేట(నర్సాపూర్): వైద్య సిబ్బంది విధులపై నిర్లక్ష్య ధోరణి అవలంబించొద్దని రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. గురువారం శివ్వంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీ నిర్వహణ, రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోగులతో మర్యాదగా ప్రవర్తిస్తూ సేవలందించాల్సిన బాధ్యత సిబ్బంది పై ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఇచ్చే సర్వేలు పూర్తి స్థాయిలో చేయాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, నర్సాపూర్ డివిజన్ వైద్యాధికారి సృజన, స్థానిక వైద్యులు సాయిసౌమ్య, పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్ పోగొట్టుకున్న వృద్ధుడు

ఖాతాలో నుంచి రూ.2.29 లక్షలు మాయం

పటాన్‌చెరు టౌన్: ఓ వృద్ధుడు ఫోన్ పోగొట్టుకోగా, ఫోన్ ద్వారా అతడి ఖాతా నుంచి డబ్బులు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీకి చెందిన ఓ వృద్ధుడు (69) గత నెల 29న ఆర్టీసీ బస్సులో ఫోన్ పోగొట్టుకున్నాడు. అయితే ఫోన్‌కు ఎలాంటి లాక్ లేకపోవడంతో అపరిచిత వ్యక్తులు అతడి బ్యాంక్ ఖాతా నుంచి రూ.2 లక్షల 29 వేలు డ్రా చేశారు. దీంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రమాద స్థలంలో రాజు

వెల్దుర్తి(తూప్రాన్) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన వెల్దుర్తి మండలం చెర్లపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శివ్వంపేట మండలం పాంబండ గ్రామానికి చెందిన మానుక రాజు(27) గురువారం పని నిమిత్తం వెల్దుర్తికి బైక్‌పై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఒక్కసారిగా గొర్రె పిల్ల అడ్డురావడంతో ఢీకొని కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో గొర్రె కూడా మృతి చెందింది. మృతుడికి భార్య నవనీత, తల్లి ఎల్లమ్మ ఉన్నారు.

పాడుబడిలో పిల్లల పాట్లు

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మహాత్మా పూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో తరగతి గదులు చాలక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎనిమిది, తొమ్మిదవ తరగతుల విద్యార్థులు రేకుల షెడ్డులోని చిన్నపాటి తరగతి గదులలో చదువుకుంటున్నారు. రెసిడెన్షియల్ స్కూల్ కావడంతో అదే గదిలో చదువుకొని అక్కడే నిద్రిస్తున్నారు. వారి పెట్టెలు, దుప్పట్లు, బట్టల బ్యాగులు తమ చుట్టూ పెట్టుకొని ఇరుకుగా ఉంటున్నారు. గదికి ఉన్న జాలి కిటికీల నుంచి రాత్రి సమయంలో చల్లని గాలులు వచ్చి విద్యార్థులు వణుకున్నారు. కావున అధికారులు స్పందించి విద్యార్థులకు సరైన సదుపాయం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మహాత్మా పూలే రెసిడెన్షియల్ స్కూల్



గదికి ఉన్న జాలి కిటికీలు



పెట్టెలు, దుప్పట్లు, బట్టల బ్యాగుల మధ్యనే చదువుకుంటున్న విద్యార్థులు

క్రీడా పండుగకు వేళాయే..

- రేపటి నుంచి సీఎం కప్ పోటీలు
- కమిటీల ఏర్పాటు పూర్తి
- కొనసాగుతున్న అవగాహన సమావేశాలు



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

మెదక్ కలెక్టరేట్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్–2024 క్రీడాపోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నద్ధమైంది, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ గల క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎదిగేలా ఈ క్రీడల ద్వారా ప్రోత్సాహం అందిస్తారు. ప్రభుత్వం ఇటీవలె క్రీడా పోటీలకు సంబంధించి ప్రణాళిక విడుదల చేసింది. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో చేపట్టే క్రీడా పోటీల్లో అండర్–14, అండర్–28తోపాటు సీనియర్ స్థాయిల్లో క్రీడాకారులకు అవకాశం కల్పిస్తున్నారు.

7, 8 తేదీల్లో గ్రామ స్థాయి..

ఈనెల 7, 8 తేదీల్లో గ్రామ పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో క్రీడాకారులకు పోటీలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గ్రామీణ స్థాయి క్రీడాకారులకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా క్రీడలలో పోటీలు నిర్వహించి ఇందులో గెలుపొందిన వారికి మెరిట్, పాల్గొన్నట్లు ధ్రువపత్రం అందజేస్తారు.

10 నుంచి 12 వరకు మండల, మున్సిపాలిటీల్లో..

గ్రామీణ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని మండల స్థాయికి ఎంపిక చేస్తారు. మండల స్థాయిలో 10 నుంచి 12 వరకు 3 రోజులపాటు పోటీలు నిర్వహిస్తారు. ఇందులో గెలుపొందిన వారికి మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో మెరిట్, పాల్గొన్నట్లు ధ్రువపత్రం అందజేస్తారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలో ఎంపికైన క్రీడాకారుల వివరాలను 12న 5 గంటలలోపు జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో అందజేస్తారు.

జిల్లా స్థాయిలో పది విభాగాల్లో పోటీలు

మండల, మున్సిపాలిటీ స్థాయిల్లో ప్రతిభ కనబర్చి గెలుపొందిన క్రీడాకారులకు 16 నుంచి 21 వరకు 6 రోజులపాటు జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి క్రీడలు ఉంటాయి. పది విభాగాలు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, యోగా, చెస్ పోటీలు నిర్వహించనున్నారు. గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్స్‌తో పాటు పాల్గొన్న క్రీడాకారులకు పాల్గొన్నట్లు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని 27 నుంచి 2025 జనవరి 2 వరకు 7 రోజుల పాటు హైదరాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పంపిస్తారు.

కమిటీల వివరాలు

సీఎం కప్ జిల్లా కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఎస్పీ , కో వైస్ చైర్మన్‌గా అదనపు కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి, మెంబర్‌లుగా జిల్లా విద్యాధికారి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లేదా కార్యదర్శి, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్, సంబంధిత క్రీడా జిల్లా అధ్యక్షుడు, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలు ఉంటారు. మండల స్థాయి కమిటీలో చైర్మన్‌గా మండల స్పెషల్ ఆఫీసర్, కన్వీనర్‌గా ఎంపీడీవో, ఎమ్మార్వో, ఎంఈఓ, గెజిటెడ్ హెడ్మాస్టర్, మండల సీఐ, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సీనియర్ ప్లేయర్ సభ్యులుగా ఉంటారు. మున్సిపాలిటీ స్థాయి కమిటీలో చైర్మన్‌గా మున్సిపల్ చైర్మన్, కన్వీనర్‌గా కమిషనర్, ఎమ్మార్వో, ఎంఈఓ, గజిటెడ్ హెడ్మాస్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోలీస్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సీనియర్ ప్లేయర్ సభ్యులుగా ఉంటారు.

రూ. లక్ష బహుమతి

రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన గ్రూపునకు మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.75 వేలు, మూడో విజేతకు రూ.50 వేలు నగదు అందజేస్తారు. అలాగే వ్యక్తిగత క్రీడాంశంలో మొదటి విజేతకు రూ.20 వేలు, రెండో విజేతకు రూ.15 వేలు, మూడో విజేతకు రూ.10 వేలు నగదు అందజేస్తారు. అలాగే సీఎం కప్ 2024 ట్రోఫీని కూడా అందజేస్తారు.

ఎక్కువ పతకాలు సాధించాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: రేపటి నుంచి జిల్లాలో ప్రారంభం కానున్న సీఎం కప్ పోటీల్లో క్రీడాకారులు ఎక్కువ పతకాలు సాధించేలా పీఈటీ, పీడీలు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో 7 నుంచి 21 వరకు జరుగుతాయన్నారు. వివిధ స్థాయిలో పోటీలు విజయవంతంగా నిర్వహించడానికి పీఈటీలు, పీడీలు తమ వంతు సహకారం అందించాలన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



క్రీడల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు www.cmcup 2024. telagangana. gov.in వెబ్ పోర్టల్ నందు పేర్లు నమోదు చేసుకోవాలి. అందులో వయస్సు ధ్రువీకరణ పత్రం లేదా 10వ తరగతి మెమో, ఆధార్ కార్డును తప్పని సరిగా అప్‌లోడ్ చేయాలి. అనంతరం ఆ పత్రాలను సంబంధిత అధికారులకు అందజేయాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– దామోదర్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి, మెదక్

పురుగు మందు తాగి బాలిక ఆత్మహత్య

మద్దూరు(హుస్నాబాద్): పురుగు మందు తాగి బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని లద్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిలివేరు విజయ నర్సింహాస్వామి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు అస్మిత (15) గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. 3న తల్లిదండ్రులు చేర్యాల మార్కెట్‌లో పత్తి అమ్మడానికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అస్మిత పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

కుటుంబ సమస్యలతో..

దుబ్బాకటౌన్: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బేగంపేట పోలీసుల కథనం మేరకు.. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందిన ఏర్పుల నర్సింలు (41) వ్యవసాయ కూలీగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. కొద్ది కాలంగా మద్యానికి బానిసై కూలి పనికి వెళ్లకుండా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారి భార్య, కుటుంబ సభ్యులతో గొడవపడుతుండేవాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నర్సింలు పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు మొదట గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బేగంపేట ఏఎస్‌ఐ అమృత్ తెలిపారు.

ఉరేసుకొని యువకుడు

పటాన్‌చెరు టౌన్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివ బహుద్దూర్(23) బతుకుదెరువు కోసం బంధువులతో కలిసి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు వచ్చి తేజా కాలనీలో ఉంటున్నాడు. పాశమైలారంలోని ఓ పరిశ్రమలో కార్మికుడుగా పని చేస్తున్నాడు. 4న అతడితో ఉండే బంధువులు, స్నేహితులు పరిశ్రమలో విధులకు వెళ్లగా శివ గదిలోనే ఉన్నాడు. రాత్రి 7 గంటలకు తిరిగొచ్చేసరికి గది గడియ పెట్టి ఉంది. తలుపులు పగులగొట్టి చూడగా లోపల ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. అనారోగ్యంతో గాని, ఇతర కారణాల వల్ల గాని బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని బంధువు ప్రతాప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పదంగా యువకుడు

తూప్రాన్: అనుమానాస్పదంగా యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నర్సంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నర్సంపల్లి గ్రామానికి చెందిన తునికి శివ(25) తల్లిదండ్రులు కొద్ది రోజుల కిందట మృతి చెందారు. అప్పటి నుంచి శివ డ్రైవర్‌గా పని చేస్తూ దివ్యాంగురాలైన తన సోదరితో కలిసి పూరిగుడిసెలో నివసిస్తున్నారు. గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.


అటవీ భూమి దున్నకం

- ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఆత్మహత్యాయత్నానికి యత్నించిన రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): అక్రమంగా అటవీ భూమిలోకి ప్రవేశించి దున్నకం చేపట్టడటంతో ట్రాక్టర్‌ని అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకొని కార్యాలయానికి తరలిస్తుండగా సదరు రైతులు ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి అల్లీపూర్ ప్రాంతంలో అటవీ భూమిని కొందరు రైతులు రాత్రి వేళల్లో చదును చేసి దున్నకం చేపట్టిన విషయం అటవీ సిబ్బందికి తెలిసింది. వెంటనే దాడి చేసి రైతులను గుర్తించి ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని నర్సాపూర్ అటవీ కార్యాలయానికి తరలిస్తుండగా సదరు రైతులు రూప్ సింగ్, విజయ్ అచ్చంపేట వద్ద అటవీ సిబ్బందిని అడ్డుకొని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించగా సిబ్బంది అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసుల సహాయంతో ట్రాక్టర్‌ని నర్సాపూర్ అటవీ కార్యాలయానికి తరలించారు. సదరు రైతులను మనోహరాబాద్ అటవీ కార్యాలయానికి తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు. ట్రాక్టర్ ఆధీనంలోనే ఉందని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అటవీ సెక్షన్ అధికారి కిరణ్‌కుమార్ అన్నారు.

ఎస్‌బీఐ రివార్డ్స్ పేరుతో సైబర్ మోసం

రూ.1.70 లక్షలు పోగొట్టుకున్న యువకుడు



పటాన్‌చెరు టౌన్: ఎస్‌బీఐ రివార్డ్స్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో ఓ యువకుడు నగదు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎంజీ రోడ్డుకు చెందిన ఓ యువకుడికి గత నెల 24న ఎస్‌బీఐ రివార్డ్స్ పేరుతో ఫోన్ కాల్ వచ్చింది. స్పందించిన యువకుడు వారు చెప్పిన విధంగా యాప్‌ను డౌన్ లోడ్ చేసి వివరాలు నమోదు చేయగా వెంటనే అతని క్రెడిట్ కార్డు నుంచి రూ.1.70 లక్షలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. యువకుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

దుబ్బాకటౌన్ : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు సిద్దిపేట జ్యుడిషియల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి, దుబ్బాక ఇన్‌చార్జి న్యాయమూర్తి వీ.తరణి గురువారం తీర్పునిచ్చినట్లు దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న తొమ్మిది మందికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా, మద్యం తాగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. వారిని కోర్టులో హాజరుపర్చగా 8 మందికి రూ.6,500 జరిమానా, మరో వ్యక్తికి రూ.వెయ్యి జరిమానాతోపాటు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

మట్టిని ప్రేమిద్దాం.. రక్షిద్దాం

- డాక్టర్ అయోధ్యరెడ్డి



మాట్లాడుతున్న అయోధ్యరెడ్డి

సిద్దిపేట ఎడ్యుకేషన్: భూమిపై జీవం నిలబెట్టేందుకు మట్టి ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తుందని, ప్రతీ ఒక్కరి జీవితం మట్టిపైనే ఆధారపడి ఉందని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో జంతు, మత్స్యశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో వరల్డ్ సాయిల్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవుల నరికివేత, పారిశ్రామిక కాలుష్యం మూలంగా మట్టి క్షీణిస్తుందని, తద్వారా పంటల దిగుబడి తగ్గడంతోపాటు నీటి కాలుష్యం పెరుగుతుందన్నారు. మట్టిని రక్షించుకునేందుకు మట్టిని ప్రేమించాలని అందుకోసం విరివిగా మొక్కలను నాటి పెంచాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. నీటి వృథాను అరికట్టి మట్టిని కాలుష్యం నుంచి రక్షించేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జగదీశ్వరాచారి, రాంకుమార్, వెంకటేశ్‌తో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బకాయిలు చెల్లించండి

- విజయ డెయిరీ జిల్లా చైర్మన్ లక్ష్మారెడ్డి



వినతిపత్రం అందిస్తున్న లక్ష్మారెడ్డి, డైరెక్టర్‌లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో పాడి రైతులు ఎదుర్కొంటున్న బకాయిల సమస్యలను పరిష్కరించాలని విజయ డెయిరీ జిల్లా చైర్మన్ లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం హైద్రాబాద్‌లో విజయ డెయిరీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని పాడి రైతులు అధికంగా పాలను విజయ డెయిరీకి విక్రయిస్తున్నారని, ఇప్పటికి రెండు నెలల బిల్లులు బకాయి ఉన్నాయని తెలిపారు. బిల్లులు బకాయిలు ఉండటంతో పాడి పశువుల పెంపకం ఇబ్బందిగా మారుతుందన్నారు. ప్రతీ 15 రోజులకోకసారి పాల బిల్లులు చెల్లించాలని కోరామన్నారు. రెండు రోజుల్లో ఒక బిల్లు (15 రోజులు పాలు విక్రయించిన బిల్లు) పాడి రైతులకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తామని హామి ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ జిల్లా డైరెక్టర్‌లు కనకారెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు అందక రైతుల ఆందోళన

ములుగు(గజ్వేల్): విజయ డెయిరీ నుంచి పాల బిల్లులు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాడి రైతులు ములుగు పాల శీతలీకరణ కేంద్రం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా తమకు బిల్లులు రావడం లేదన్నారు. తమ పాడి పశువుల దాణా, గడ్డి ఇతర అవసరాలకు ఇబ్బందిగా ఉందని వాపోయారు. కేవలం పాల బిల్లుల పైనే ఆధారపడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భవనం మెట్లపై నుంచి పడి విద్యార్థినికి గాయాలు

- కస్తూర్బా పాఠశాలలో ఘటన
- స్కూల్‌ను సందర్శించిన ఆర్డీవో, ఇతర అధికారులు



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో రమాదేవి

రామాయంపేట(మెదక్): భవనం మెట్లపై నుంచి విద్యార్థినికి గాయాలైన ఘటన రామాయంపేటలోని కస్తూర్బా పాఠశాలలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని రేణుక బుధవారం రాత్రి హాస్టల్‌లో భవనం మెట్లపై నుంచి పడింది. దీంతో గాయాలు కాగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలిక కాలు, చేయి విరిగినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న మెదక్ ఆర్డీవో రమాదేవి, స్థానిక తహసీల్దార్ రజనికుమారి, ఎస్‌ఐ బాల్‌రాజు పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కాగా తనను ఎవరో వెనుక నుంచి తోసివేసినట్లు అనిపించిందని బాధిత బాలిక కుటుంబ సభ్యులకు చెప్పినట్లు సమాచారం. రేణుక తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందగా, ప్రస్తుతం నానమ్మ వద్ద ఉంటూ చదువుకుంటుంది.

కొండచిలువలతో భయం.. భయం



చందాపూర్ గ్రామ సమీపంలో కొండచిలువ

దుబ్బాక: మండలంలోని చందాపూర్ గ్రామస్తులను కొండ చిలువలు హడలెత్తిస్తున్నాయి. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే క్రమంలో కొండ చిలువలు కనిపించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల కింద గ్రామంలో కొండ చిలువ సంచరించగా గ్రామస్తులు గుర్తించిన తెలిసిందే. కొందరు యువకులు ధైర్యంచేసి వాటిని పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేశారని గుర్తు చేశారు. తిరిగి మళ్లీ పాములు రావడంతో రైతులు వ్యవసాయ బావుల వద్దకు ఒక్కరు వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తుం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్ గ్రామానికి సమీపంలో ఉండటంతో పాములు వస్తున్నాయని గ్రామస్తులు భయాన్ని వ్యక్తం చేశారు. రిజర్వాయర్ ఎగువన దట్టమైన అటవీ ఉండటంతో కొండచిలువలు అక్కడి నుంచి కూడవెల్లి వాగు నుంచి గ్రామంలోకి వస్తున్నామని మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు తెలిపారు. అధికారులకు సమాచారం అందించినా వారు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అబద్ధాలు, మోసాలతో కాంగ్రెస్ పాలన

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్



సభలో మాట్లాడుతున్న కిషోర్

గజ్వేల్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుండగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలపై అబద్ధాలు చెబుతూ 66 మోసాలతో పాలన సాగిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన నిరసన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల తీరుపై మండిపడ్డారు. తెలంగాణలో మిగులు బడ్జెట్ ఉండగా అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ రూ.లక్షల కోట్ల అప్పులు చేసిందని, బీఆర్‌ఎస్‌పై విసుగెత్తిన ప్రజలు మార్పు కోసమంటూ కాంగ్రెస్‌కు పట్టం కడితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 6 అబద్ధాలు, 66 మోసాలతో పాలన సాగిస్తుందన్నారు. హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని, ఓవైసీ కళాశాల, కేటీఆర్ ఫాంహౌస్‌లపై చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఎల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, నందన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండలశాఖ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, అసెంబ్లీ కోకన్వీనర్లు మహేశ్, సురేశ్, నాయకులు నాయిని సందీప్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.